

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వడ్డేపల్లి, సెప్టెంబరు8 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పైపాడుకు చెందిన కురువ పోగుల వెంకటేష్(50) గ్రామ స్టేజీ వద్ద ఉన్న రాధా సత్సంగ్ ఆశ్రమంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఆశ్రమంలో ట్రాన్స్‌పార్మర్ వద్ద గడ్డి తీస్తుండగా విద్యుత్ తీగ తగిలి, షాక్‌కు గురయ్యాడు. స్థానికులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

వినాయక చవితి ఉత్సవాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఊరూవాడా కొలువు దీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రూపాల్లో ఉన్న భారీ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. వాటిని చూసేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



నారాయణపేట మండలం బిజ్వార్‌లో న్యూ ప్రొఫెషనల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం




నాగర్‌కర్నూల్‌లో మైల్డ్ స్టోన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు



మహబూబ్‌నగర్‌లోని కిసాన్‌నగర్‌లో ఆది దేవుడి అవతారంలో గణపతి



పేట అశోక్‌నగర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బాలరాముడి ఆకారంలో మట్టి వినాయకుడు



బాదేపల్లి రంగనాయకుల గుట్టపై రంగనాయకస్వామి అవతారంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి



చిన్నజట్రం ఆంజనేయ స్వామి ఆలయంలో కొలువు దీరిన భారీ వినాయక విగ్రహం



పేట సీపీఆర్ బంగ్లాలో వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ఆవంచలో వెలిసిన ఐశ్వర్య గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

విద్యా వ్యవస్థలో మార్పు

» పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ

» ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం కృషి: చిన్నారెడ్డి



పాఠశాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఐజీ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తదితరులు

అమరచింత, సెప్టెంబరు 8 : మారుతున్న కాలానికి అనుగుణంగా భారత దేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి కేంద్రం కొత్త విద్యా వ్యవస్థను తెస్తోందని ఎంపీ డీకే అరుణ అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తీపూర్ గ్రామంలో రూ.కోటి పది లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుధ్ రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డిలతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అరుణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఐజీ రమేష్ రెడ్డి ఇదే పాఠశాలలో చదువుకొని పోలీస్ ఉన్నతాధికారి అయ్యారని గుర్తు చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి, ఉపాధ్యాయులకు.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వేదికపై కూర్చున్న వివిధ శాఖల అధికారులు, ఎంపీగా తాను, ఎమ్మెల్యేలు అందరం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లమేనని అన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి కేంద్రం రూ.71 లక్షలకు పైగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి గ్రామానికి చెందిన ఐజీ రమేష్ రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, డీఈవో గోవిందరాజులు, ఎస్పీ గిరిధర్ రావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసింది గత పాలకులే: జి.చిన్నారెడ్డి

ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే, అందులో 35 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని.. అదే 13 వేల ప్రైవేటు పాఠశాలలు ఉంటే.. అందులో 34 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. గత పదేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుధ్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి మాట్లాడారు.

డ్రగ్స్ నిర్మూలనకు నడుం బిగించాలి: ఐజీ

ఐజీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో విజృంభిస్తున్న డ్రగ్స్‌ను పాఠశాల స్థాయి నుంచే నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఐజీ రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ విశేషంగా కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదివి, ఊరికి మంచి పేరు తేవాలన్నారు. ఈ గ్రామంలో పుట్టి, ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా పట్టుదలతో చదివి, లక్ష్యాన్ని సాధించాలని కోరారు.

కందనూలు చుట్టూ కబ్జాలే

» కుంటలు, చెరువులను ధ్వంసం చేస్తున్న రియల్ మాఫియా

» నీటి వనరుల విధ్వంసం వెనుక బీఆర్ఎస్ కౌన్సిలర్, మరో నాయకుడి హస్తం



కేసరి సముద్రం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన విలాసవంతమైన భవనం చుట్టూ చేరిన నీరు



తుమ్మలకుంటలో ఏర్పాటు చేసిన బొగ్గుల బట్టీ

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న నీటి వనరులు ధ్వంసమవుతున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్, మరో నాయకుడు కలిసి వ్యూహాత్మకంగా చెరువులు, కుంటలను ఆక్రమించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్, అదే పార్టీకి చెందిన మరో నాయకుడు కలిసి చెరువుల శిఖం భూములను ఆక్రమించే ప్రక్రియలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం ఎఫ్‌టీఎల్‌లో ఇద్దరు కలిసి భూమిని ఆక్రమించారు. అందులో ఒకరు నిర్మించిన విలాసవంతమైన భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. ఈ భవనానికి మూడు పక్కల నుంచి కేసరి సముద్రం నీళ్లు విస్తరించడం గమనార్హం. ఈ భవంతిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదై ఉంది. దీని పక్కనే భారత రాష్ట్ర సమితికి చెందిన కౌన్సిలర్ భూమిని ఆక్రమించి విలాసవంతమైన భవనాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేయగా ఎన్‌జీటీలో కేసు నమోదైన కారణంగా ముందడుగు పడలేదు. తాము న్యాయబద్ధంగానే భూమిని కొనుగోలు చేశామని, తాము ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో లేమని చెప్పినప్పటికీ కేఎల్ఐ నీరు, వరదల కారణంగా కేసరి సముద్రం పూర్తిస్థాయిలో నిండటంతో వీరి బండారం బయట పడింది. మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో నాగర్‌కర్నూల్ శ్రీశైలం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఊరకుంటను ఆక్రమించే క్రమంలో ఉద్దేశపూర్వకంగా వర్షం నీళ్లు అక్కడ నిల్వ ఉండకుండా ఎక్స్‌కవేటర్‌తో గండి కొట్టారు. అవుడకుంటలో కూడా అదే పరిస్థితి నెలకొంది. నెల్లికొండలోని తుమ్మలకుంటకు సంబంధించి కేసు ఎన్‌జీటీలో ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ మాఫియాకు సంబంధించిన వారు ఏకంగా కుంటను తెగ్గొట్టి వెంచర్‌కు దారి వేశారు. కుంటలో నీళ్లు నిలవాల్సి ఉన్న చోట బొగ్గుల బట్టీలు వెలిశాయి.



ఉయ్యాలవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంటకు పెట్టిన గండి

రికార్డులను మార్చేందుకు యత్నం

తుమ్మలకుంట, పుట్నాలకుంట, సద్దల్‌సాబ్ కుంటలలో అనేక అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇటీవల అర్ధరాత్రి దాకా తహసీల్దార్ కార్యాలయంలోనే ఉండి రికార్డులను మార్పిడి చేసే ప్రయత్నం చేయగా ఎమ్మెల్సీ సీరియస్‌గా అధికారులను మందలించినట్లు తెలిసింది. ఎవరైన అక్రమాలకు పాల్పడినా, రికార్డులను మార్పిడి చేసినా సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం.

అనుమతులు లేని భూమిని కట్టబెట్టిన మాఫియా

కొల్లాపూర్ చౌరస్తాలోని గాయత్రి హాస్పిటల్ ముందు భాగంలో మూడెకరాల విస్తీర్ణంలో టెనెంట్ ఉన్నప్పటికీ భూమిని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ మాఫియా అక్కడి నుంచి బైపాస్ రోడ్డు వస్తుందని నమ్మబలికి నాగర్‌కర్నూల్ పట్టణంలోని వివిధ ప్రధాన వృత్తుల్లో ఉన్న వారికి స్థలాన్ని కట్టబెట్టారు. టెనెంట్ ఉన్న కారణంగా ఆ భూమికి మునిసిపల్ పరమైన అనుమతులు రాకపోవడంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేసిన ప్రముఖులు లబోదిబోమంటున్నారు. ఈ క్రమంలో ఇందులో భాగస్వామి అయిన బీఆర్ఎస్ కౌన్సిలర్ అధికార కాంగ్రెస్‌కు చెందిన ఒక వ్యక్తికి మూడు ప్లాట్లు రోడ్డు ఫేసింగ్‌లో అతి తక్కువ ధరకే ఇస్తామని చెప్పారని తెలిసింది. భూమి వివరాలు తెలుసుకున్న సదరు అధికార పార్టీ నాయకుడు దాన్ని కొనుగోలు చేయడానికి ససేమిరా అన్నాడు. ఈ విషయం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి దాకా వెళ్లగా, న్యాయబద్ధంగా ఉంటే భూములను కొనుగోలు చేయాలని, అసంబద్ధంగా ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనూ నేను సహకరించబోనని చెప్పినట్లు తెలిసింది. దీంతో గాయత్రి హాస్పిటల్ ఎదురుగా ఉన్న భూమిని కొనడానికి అధికార పార్టీ నాయకులు వెనక్కి తగ్గారు. సదరు కౌన్సిలర్ ఆర్టీసీ డిపో పక్కన అసైన్డ్ భూమిని ఒక వర్గానికి కట్టబెట్టే క్రమంలో దాదాపు రూ.20 లక్షలు చందాలు వసూలు చేసినట్లు అధికార పార్టీ నాయకుల దృష్టికి వెళ్లింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

» తల్లి, మరో ఇద్దరు పిల్లలను రక్షించిన గ్రామస్థులు

నారాయణపేటరూరల్, సెప్టెంబరు 8 : నారాయణపేట జిల్లా నారాయణపేట మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలోని ఆశిరెడ్డి చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఆదివారం జరిగిన సంఘటనపై గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన రాజమ్మ సోదరుడు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆమె, నలుగురు పిల్లలతో కలిసి ఐదురోజుల క్రితం తల్లిగారి ఊరైన తిర్మలాపూర్‌కు వచ్చింది. సోదరుడి ద్వాదశ దినకర్మ ముగిసిన అనంతరం శనివారం తన గ్రామానికి వెళ్లాలనుకున్నా, అనివార్య కారణాలతో వెళ్ళలేక పోయింది. ఆదివారం ఉదయం దుస్తులు ఉతుక్కునేందుకు నలుగురు పిల్లలతో కలిసి గ్రామ సమీపంలోని ఆశిరెడ్డి చెరువుకు వెళ్ళింది. ఆమె దుస్తులు ఉతుకుతుండగా, నలుగురు చిన్నారులు చెరువులో దిగి ఆడుకుంటూ కాస్తా లోతుకు వెళ్లడంతో నీటిలోకి జారిపోయారు. వారిని తల్లి గమనించి కాపాడేందుకు వెళ్లి ఆమె కూడా ప్రమాదంలో చిక్కుకున్నది. అక్కడే ఉన్న గ్రామస్థులు కొందరు రాజమ్మతో పాటు ఇద్దరు పిల్లలు మంగళ, కీర్తిలను కాపాడారు. మరో ఇద్దరు పిల్లలు మూగ బాలిక ప్రీతి (14), ప్రవీణ్ అలియాస్ రోహిత్ (12) నీటిలో మునిగి చనిపోయారు. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సి.రాముడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలతో బయట పడ్డ చిన్నారులను, మరో ఇద్దరి మృతదేహాలను నారాయణపేట ఆసుపత్రికి తరలించారు.



చిన్నారులను మింగిన చెరువు ఇదే..

సుప్రీం తీర్పు బాధాకరం

» ఎమ్మెల్యేలు వివేక్, కేఆర్ నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

పాలమూరు, సెప్టెంబరు 8: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అత్యంత బాధాకరమని, మాలలు సంఘటితం అయితేనే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో మాల ఉద్యోగులు, మాలల ఆత్మీయ సమ్మేళనం, మాట-ముచ్చట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్డియాలజిస్టు డాక్టర్ గోపినాథ్, దిగంబర కాంబ్లే, రవీందర్, కృష్ణలతో కలిసి వారు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, రామాకాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివేక్, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేవలం బ్యాక్ బెంచ్(రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చనే సూచన)ద్వారా మాత్రమే అనుమతి వచ్చిందని గుర్తు చేశారు. సంపూర్ణంగా అనుమతి ఇచ్చినట్లు, వర్గీకరణ చేసినట్లు కాదన్నారు. ఇప్పట్లో వర్గీకరణ అమలు చేయటం కుదరదన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆశయం దిశగా దళితులంతా ఒక్కటేనని మరువరాదన్నారు. దళితులను విడదీసి పాలించాలనుకునే కుట్రను తిప్పికొడదామన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అత్యంత బాధాకరమని, అది మాలలకు ఏమాత్రం న్యాయం చేయదన్నారు. తీర్పు అంశాలను పరిగణలోకి తీసుకుంటే క్రిమిలేయర్ విధానం ఎక్కడా అప్పీల్‌లో లేదన్నారు. మాలలంతా సంఘటితంగా ఉండి, జిల్లాలో రెండు లక్షల మందితో మహాసభ నిర్వహించి బలనిరూపణ చేద్దామన్నారు. ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ మాలను ధరించి, దీక్షను పూనాలన్నారు. నేటి పరిస్థితుల్లో మాలల ఐక్యత చాలా అవసరమన్నారు. అనంతరం మాల ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణయ్య, పార్థసారథి, సురేందర్, రవీందర్, నారాయణ, మామిడి సమతా సైనిక్ దళ్ రక్షణ కన్వీనర్ దిగంబర కాంబ్లే పాల్గొని ప్రసంగించారు. అనంతరం అతిథులను ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన మాలలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

పెండింగ్ పాలబిల్లులు వెంటనే చెల్లించాలి

విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల ధర్నా

ఊర్కొండ, సెప్టెంబరు 8: పాల బిల్లులు వెంటనే చెల్లించాలని విజయడెయిరీ పాలఉత్పత్తిదారులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఊర్కొండపేట బీఎంసీ పరిధిలోని పాల ఉత్పత్తిదారులు రోడ్డుపై పాలను పారబోసి, నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే పాల బిల్లులు సరిగా రావడం లేదన్నారు. రెండు నెలల పదిహేను రోజుల(5) బిల్లులు రావాల్సి ఉందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పశువులకు దాణా పెట్టలేకపోతు న్నామని, ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులు తిర్మని బాలరాజు, నందడి శ్రీనివాస్‌రెడ్డి, బొద శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రఘురామరెడ్డి, అశోక్‌గౌడ్ ఉన్నారు.



ఊర్కొండ-జడ్చర్ల రోడ్డుపై పాలు పారబోస్తున్న ఉత్పత్తిదారులు

గుట్టపై బ్లాస్టింగ్ చేస్తే ఊరుకోం..

రాతి కడీలు తీస్తున్నవారిని అడ్డుకున్న గిరిజనులు

ఊర్కొండ, సెప్టెంబరు 8: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొం డపేట శివారులో ఉన్న గుట్టలపై అనుమతి లేకుండా రాతి కడీలు, రాయి ఎలా తీస్తారని అదే గ్రామ పంచాయతీ పరిధిలోని ఠాకూర్ తండావాసులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి, అక్కడి నుంచి అందరినీ బయటికి పంపారు. ఈ సందర్భంగా ఠాకూర్ తండావాసులు మాట్లాడుతూ వ్యవసాయం చేసుకునే మేము, తండాలోని పశువులు, మేకలు, గొర్రెలను గుట్టపైనే మేతకు వదిలేసి, వ్యవసాయ పనులు చేసుకుంటామని అన్నారు.

వడ్డెర కూలీలతో మధ్య దళారులు ఒప్పందం చేసుకొని ఈమధ్యన గుట్టపై బ్లాస్టింగ్ చేస్తూ రాతికడీలు, రాయి తీస్తున్నారని, యంత్రాల ద్వారా రాయిని కోస్తుండటంతో దుమ్ము, దూళి పడిపంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. బ్లాస్టింగ్ శబ్దాలకు పశువులు భయపడి పారిపోతున్నాయన్నారు. అనుమతి లేకుండా రాయి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ జీవనోపాధికి ఇబ్బందులు కలిగిస్తున్న వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తండావాసులు విజేందర్‌నాయక్, లచ్చిరామ్‌నాయక్, తిరుపతినాయక్, కిరణ్‌నాయక్, జగ్యా, దేవేందర్, శ్రీను,సాయి, గోపి, శేఖర్, సాగర్, రమేశ్, మోతిలాల్ ఉన్నారు.



గుట్టపై కడీలు తీస్తున్న వారిని అడ్డుకుంటున్న ఠాకూర్ తండావాసులు

కొల్లాపూర్‌కు సఫారీ వాహనం

- త్వరలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభం

కొల్లాపూర్, సెప్టెంబరు 8: కొల్లాపూర్ మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి ఆశాఖ జిల్లా అధికారులు సఫారీ వాహనాన్ని కేటాయించారు. శనివారం ఈ వాహనం కొల్లాపూర్ చేరింది. సోమశిల వద్ద కృష్ణానది నుంచి అందుబాటులో ఉంచనున్నారు. ఒకేసారి ఏడుగురు ప్రయాణించే అవకాశం ఉంది. ఈ వాహనంలో సోమశిల రహదారిలో ఉన్న అర్బన్ పార్కుతోపాటు వాచ్‌టవర్‌ను పర్యాటకులకు అటవీ సిబ్బంది చూపనున్నారు. తిరిగి సోమశిల కృష్ణానది పుష్కరఘాట్ల వద్దే విడిచిపెడతారని ఫారెస్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సఫారీ టూర్‌ను త్వరలోనే ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారని చెప్పారు.



కొల్లాపూర్ అటవీశాఖ కార్యాలయం వద్ద సఫారీ వాహనం

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు

తిమ్మాజిపేట, సెప్టెంబరు 8: అదనపు కట్నంతేవాలని తనను అత్తగారింట్లో వేధిస్తున్నారని శనివారం మండలంలోని ఎదిరేపల్లికి చెందిన కోడలు కావలి శోభ ఫిర్యాదు చేశారని ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తెలకపల్లి మండలంలోని కార్వంగకు చెందిన బోయ సుధాకర్‌తో ఎదిరేపల్లి కావలి శోభకు నాలుగేళ్లక్రితం వివాహమైంది. రూ.5లక్షల నగదు, 10తులాల బంగారం వివాహ సమయంలో ఇచ్చారు. ఏడాది నుంచి వేధిస్తూ అదనపు కట్నంగా రూ.3లక్షలు తీసుకురావాలని శోభను పుట్టింటికి పంపించారు. తిరిగి ఆమెను అత్తారింటికి తీసుకువెళ్లడం లేదని ఫిర్యాదుచేశారు. భర్త సుధాకర్, అత్త, బావ, మరిదిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

బల్మూరు, సెప్టెంబరు 8 : మండల కేంద్రం లోని ఊరచెరువులో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం(24) లభించిందని ఎస్ఐ గురుస్వామి తెలిపారు. మృతదేహం బాగా ఉబ్బి పగిలిపోయే స్థితిలో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మృతదేహాన్ని ఖననం చేశామని గుర్తుపట్టే వ్యక్తులు ఎవరైనా ఉంటే వారికి న్యాయంచేసేందుకు సహకరిస్తామని ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

నవాబ్‌పేట, సెప్టెంబరు 8: మండలంలోని కొల్లూరు గ్రామంలో శనివారం రాత్రి పిడుగుపడి ఓ గేదె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అగ్గునూరు మల్లప్ప తన పొలంవద్దే గేదెను కట్టేసి ఇంటికి వచ్చింది. రాత్రి పిడుగుపడి గేదె మృతి చెందింది. ఉదయం రైతు మల్లప్ప పొలానికి వెళ్లిచూడగా చనిపోయి ఉండడంతో బోరున ఏడ్చాడు. దీనివిలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

విద్యుదాఘాతంతో కోడెదూడ..

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 8: మండలంలోని సల్కెలాపూర్‌లో మేడమోని శ్రీశైలానికి చెందిన కోడె దూడ ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా భూమి పదును గా ఉండడంతో షాక్‌కు గురై మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో యజమాని శ్రీశైలం కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ.30వేల విలు వ ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

బల్మూరు, సెప్టెంబరు 8 : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మన్‌పేటలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. గ్రామాని కి చెందిన ఓరే లింగం అనే వ్యక్తి తనభార్యతో తరచూ గొడవ పడేవాడు. శని వారం రాత్రికూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మళ్లీ బయటికెళ్లిన ఓరే లిం గం ఆదివారం గ్రామ సమీపంలో చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇచ్చారు. అనంతరం మృతుని భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో సత్తాచాటాలి

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర
- ఉత్సాహంగా జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు



జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. సిరిసిల్లలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. కార్యక్రమానికి శరత్‌చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. సాఫ్ట్‌బాల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని, ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని సాఫ్ట్‌బాల్ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో రాఘవేందర్, నాగరాజు, కోచ్ సాదిక్‌అలీ, వ్యాయమ ఉపాధ్యాయులు నాగమణి, పుష్ప, సుగుణ, కపిల్‌వర్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



ఉమ్మడి జిల్లా నూతన ఖోఖో కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8 : రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లాకొత్వాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఉమ్మడి జిల్లా ఖోఖో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఖోఖో సంఘం ప్రతినిధి వల్సల కుమార్, న్యాయవాది పవన్‌కుమార్‌రెడ్డి, రైల్వే టీం శిక్షకుడు నరేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఒబేదుల్లాకొత్వాల్, విలియం మరో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఒబేదుల్లాకొత్వాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటారన్నారు. జిల్లా ఖోఖో క్రీడాభివృద్ధి తన వంతు సహకరం ఉంటుందని, ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. కోశాధికారి మదుకుమార్, ఉపాధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, యు.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు రమేష్ కుమార్, దూమర్ల నిరంజన్, సంయుక్త కార్యదర్శులుగా మొగులాల్, వెంకటేశ్వర్లును ఎనుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను సన్మానించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక




రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

జడ్చర్ల, సెప్టెంబరు 8 : హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 14, 15వ తేదీలలో జరిగే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టును ఆదివారం జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ మైదానంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో 16 మందిని జిల్లా జట్టుకు, మరో నలుగురును స్టాండ్‌బై ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. జిల్లా జట్టుకు ఇర్ఫాన్‌అలీ, నవనీత్, కార్తికేయన్‌రెడ్డి, రామాంజనేయులు, చరణ్, నిఖీశ్వర్, సిద్దు, ప్రశాంత్, పవన్, విజయ్, రాంచరణ్, శివప్రసాద్, చరణ్‌తేజ్, మహేందర్, కార్తీక్, విఘ్నేష్‌లతో పాటు స్టాండ్‌బైగా చరణ్‌తేజ్, కిషన్, విశాల్, రవీందర్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు షంషద్‌అలీ, పీఈటీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దుందుభీ వాగులో దూకిన మహిళ



మహిళ కోసం వాగులో గాలిస్తున్న టీజీఎఫ్‌డీ బృందం



చెన్నమ్మ

రాజాపూర్, సెప్టెంబరు 8: మండలంలోని గుండ్లపోట్లపల్లి సమీపంలోని దుందుభీ వాగులో మహిళ దూకిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపొట్లపల్లికి చెందిన మాడమోని చెన్నమ్మ (47) తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, కుటంబ సభ్యులకు, గ్రామంలోని మరికొందరికి ఫోన్ చేసి చెప్పింది. అనంతరం గ్రామ శివారులోని ఉన్న దుందుభి వాగు వద్ద తన పర్సు, ఫోన్, బంగారు వస్తువులు ఒడ్డున పెట్టి వాగులో దూకింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టీజీఎఫ్‌డీ బృందం శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె ఆచూకీ లభ్యం కాలేదు.

గద్వాల పట్టణంలో వరుస చోరీలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 8: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం దొంగలకు నిలయంగా మారింది. కొంతకాలంగా యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్న పోలీసుల్లో ఏమాత్రం చలనం కనిపించడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. తాజాగా శనివారం జిల్లా కేంద్రంలోని కృష్ణారెడ్డి ఆసుపత్రికి సంబంధించిన మెడికల్ దుకాణంలో రూ. 1.50 లక్షల నగదుతో పాటు పక్కనే ఉన్న ఫర్టిలైజర్ దుకాణంలో నగదు, హార్డ్‌వేర్ దుకాణంలో చోరీకి యత్నం సంఘటనలు జరిగాయి. విషయాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డి, పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలను సేకరించారు. పోలీసులు దొంగతనాల వివరాలను సేకరిస్తున్నారే కాని పట్టుకొని రికవరీ చేయడంలేదని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్
- నిరసన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు
- పనులు నిలిపిన అధికారులు



వడ్డేపల్లిలో మైనింగ్ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సంపత్‌కుమార్, నాయకులు

వడ్డేపల్లి, సెప్టెంబరు 8 : భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా వడ్డేపల్లి మండలంలో కొద్ది రోజులుగా అక్రమ మైనింగ్ పనులు జరుగుతున్నాయని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సదరు కంపెనీ యాజమాన్యం పనులు చేపట్టి మట్టిని తరలిస్తున్నారని అన్నారు. ఇందుకు గాను శనివారం నాయకులతో కలిసి వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాల వద్ద దీక్ష చేపట్టి అక్కడే కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజ వనరులను కాపాడాల్సిన అధికారులే నాయకుల ఒత్తిడితో అక్రమ తవ్వకాలను పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు స్థానిక ప్రజాప్రతినిధి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పగలు, రాత్రి బ్లాస్టింగ్‌కు పాల్పడుతూ టిప్పర్ల ద్వారా రూ.కోట్ల విలువైన మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాలకు అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, పోలీసు ఉన్నతాధికారులను కోరగా, స్పందించిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పాఠశాల కోసం స్థల పరిశీలన

రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం కోసం 29 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో ఒక పాఠశాలను జిల్లాలో వడ్డేపల్లిలో మంజూరుకు ప్రభుత్వంతో మాట్లాడి సంపత్‌కుమార్ కృషి చేశారు. సీఎం ఆదేశాల మేరకు వడ్డేపల్లి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతి లభించడంతో శనివారం అధికారులతో కలిసి స్కూల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు.

పొంగి పొర్లుతున్న వాగులు



పాపగల్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ

తాడూరు, సెప్టెంబరు 8 : ఇటీవల నాలుగు రోజులుగా శాంతించిన దుందుభీ నది ప్రవాహం శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో మళ్లీ ఊపందుకుని ఉధృతంగా ప్రవహిస్తుంది. నది పరివాహక ప్రాంత గ్రామాలైన పాపగల్, సిర్సవాడ, ఎట్టిధార్‌పల్లి, అంతారం, ఆకునెల్లికుదురు, మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లిలో నది ప్రవాహం ఉధృతంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 20రోజులుగా వర్షాలు నిరంతరం కురుస్తుండడంతో దుందుభీనది నిరంతరాయంగా ప్రవహిస్తుంది. ఆదివారం తాడూరు మండల వ్యాప్తంగా మూడు సెంటిమీటర్ల వర్షాపాతం నమోదైంది. ఇప్పటికే పత్తి, మిరప పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాసిన పత్తికాయలు మురిగిపోతుండటంతోపాటు ఊడ, పూత, పిందెలు అధిక తేమశాతంతో కింద రాలిపడిపోతున్నాయంటూ ఆవేదన చెందుతున్నారు.

నిలిచిన రాకపోకలు

వెల్దండ: మండలంలోని భైరాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆమన్‌గల్ సురసముద్రం నుంచి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో వెల్దండ నుంచి భైరాపూర్, శేరిఅప్పారెడ్డిపల్లి, చారకొండకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు సీఐ విష్ణువర్థన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి రోడ్డుపై ప్రవహిస్తున్న వరదను పరిశీలించారు. ఎవరూ కూడా రహదారి వెంట రావద్దని ప్రజలకు సూచించారు. అదేవిధంగా మండలంలోని గాన్గట్‌తండా వంతెన ప్రమాదభరితంగా మారింది. గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని పోలీసులు సూచించారు.



పొర్లుతున్న చారకొండ కత్వ

ఏళ్ల తర్వాత పారిన చారకొండ కత్వ

చారకొండ: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి చారకొండ సమీపంలో ఉన్న కత్వ పొంగి పొరులుతుంది. చాలా ఏళ్ల తర్వాత పొంగి పొర్లుతుండటంతో ప్రజలు కత్వ వద్దకు వెళ్లి నీటి ప్రవాహాన్ని తిలకించి సెల్ఫీలు తీసుకున్నారు. శనివారం రాత్రి 63.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

అంతర్రాష్ట్ర గొర్రెలు, మేకల దొంగలు అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి

పూడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర గొర్రెలు, మేకల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య, చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో శనివారం రాత్రి పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో నెంబర్ ప్లేట్ లేని రెండు స్కార్పియో వాహనాలు వచ్చాయి. అట్టి వాహనాలు ఆపి తనిఖీ చేస్తుండగా, వాహనంలో ఉన్న ప్రభు, కైలాష్ చౌహాన్ అనే వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని పట్టుకుని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. వీరు గొర్రెలు చోరీ చేయడానికి వీలుండే ప్రాంతాల్లో రెక్కీ చేసుకోవడానికి వచ్చినట్లు వారు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలోని పుల్‌మామిడి, రూప్‌ఖాన్‌పేట్, ఎన్కెపల్లి, గొంగుపల్లి, కంకల్, మైలారం, కుల్కచర్ల, చల్లాపూర్‌తోపాటు పొరుగు మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట్, నాగర్ కర్నూలు, కర్ణాటక రాష్ట్రంలోని పలు గ్రామాల్లో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరు కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లాకు చెందిన ప్రభు, శేక్యా చెన్నప్ప, మారుతి, రవి, భీము, దశరథ, సంజయ్‌కుఆర్ చౌహాన్, శంకర్, చొంగయ్య, కైలాష్ చౌహాన్, కందప్ప, ముదుకప్ప వీరంతా ఒక గ్యాంగ్‌లా ఏర్పడి మద్యానికి, జల్సాలకు అలవాటై చోరీలు చేయడం వృత్తిగా మార్చుకున్నారు. వీరంతా గొర్రెలు, మేకలను చోరీ చేసి వెంటనే విక్రయించకుండా గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో కోటల్లో పెట్టి సంతలు జరిగే రోజుల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఇట్టి చోరీకి పాల్పడిన ప్రభు, కైలాష్ చౌహాన్లను అరెస్టు చేశామని, మిగిలిన తొమ్మిది మంది పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నేరస్తుల నుంచి రెండు స్కార్పియో వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, గొర్రెలు, మేకలు అమ్మగా వచ్చిన రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన వారిలో చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదన రెడ్డి, హెచ్‌సీఎస్ చెన్నయ్యగౌడ్, గోవిందప్ప, పీసీఎస్ కృష్ణ, రామకృష్ణలకు రివార్డులు అందజేశారు.

మైసమ్మ ఆలయంలో సౌకర్యాలు కల్పిస్తాం



ఆలయ ఆవరణలో ఎండోమెంట్ కమిషనరేట్ ఎస్‌ఈ, ఇతర అధికారులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 8 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఎంతో విశిష్టత కలిగిన పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం దేవాదాయ కమిషనరేట్, పర్యాటక శాఖ అధికారులు సంయుక్తంగా సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకు నేందుకు కోసం తరలివచ్చే భక్తులకు కావాల్సిన వనరులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 26.30ఎకరాల విస్తరణలో ఉన్న ఆలయ ఆవరణలో షెడ్లు, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతులపై వారు భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో హైదరాబాద్ ఎండోమెంట్ కమిషనరేట్ సూపరింటెండెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, డీఈ వేమూర్తి శ్రీనివాసశర్మ, టూరిజం శాఖ ఎండీ విజయ్, సీఎస్.గౌడ్, ఏఈ నాగార్జునగౌడ్, ఈవో రామేశ్వర్‌శర్మ, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నది ఒడ్డున మృతదేహం లభ్యం

అయిజ, సెప్టెంబరు 8: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని కేశవరం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలం వద్దఉ పోలీసులు, వైద్యులు చేరుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి జూపల్లి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, సెప్టెంబరు 8 : టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందని, వారి అనుభవం పార్టీ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతాయని మంత్రి పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 8: ఉండవల్లి మండలంలోని 44వ జాతీయరహదారిపై రెండుచోట్ల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. స్థానికులు, హైవే సిబ్బంది వివరాల మేరకు.. కర్నూలు జిల్లా కోవెలకుంట్లకు చెందిన నాగేంద్రరెడ్డి కుటుంబసభ్యులు శనివారం హైదరాబాద్ వైపు నుండి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అలంపూర్ చౌరస్తా పై ఓవర్‌పై గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో కారులో ఉన్న నాగదీప, సదిత కు గాయలయ్యాయి. ఆదివారం ప్రాగటూరు చెందిన బాలయ్య, భార్య జయలక్ష్మి కర్నూలు నుంచి సొంతూరికి బైక్‌పై బియ్యం బస్తా తీసుకుని వస్తుండగా ఉండవల్లి స్టేజీ వద్ద మలుపు తిరుగుతుండగా హైదరాబాదు వైపు వేగంగా ఓ కారు వీరిని ఢీకొంది. దీంతో శేఖర్‌కు తీవ్రగాయాలు కాగా, జయలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో రైతు మృతి



మాలరాజు (ఫైల్)

మానవపాడు, సెప్టెంబరు 8 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం, చెన్నిపాడు చెందిన మాల రాజు (49) వ్యవసాయం చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవించేవాడు. ఐదేళ్లుగా తనకున్న రెండెకరాల సొంత పొలానికి తోడు మరికొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేసేవాడు. పంటలు దిగుబడి రాక అప్పులు పెరిగిపోయాయి. అయిదెకరాల్లో పొగాకు సాగు చేశాడు. అధికవర్షాలకు మొక్కలు కుళ్లిపోతుండటంతో పంటచేతికి రాకపోతే అప్పులు ఎలా తీర్చాలన్న బెంగతో వారం రోజులుగా తీవ్రవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి తీవ్ర తలనొప్పి, హైబీపీ రావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి, మరొకరికి గాయాలు

రాజాపూర్/నవాబ్‌పేట, సెప్టెంబరు 8: మండలంలోని కుచ్చుర్‌కల్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెంది, మరో వ్యక్తికి గాయాలైన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కే.రవి తెలిపిన వివరాల ప్రకారం నవాబ్‌పేట మండలం కారుర్ చెందిన షైబు, అదే గ్రామానికి చెందిన గోపనమౌని జంగయ్య (32) వారి పనులు ముగించుకోని సాయంత్రం జడ్చర్ల నుంచి ద్విచక్ర వాహనంపై వారి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కుచ్చుర్‌కల్ దగ్గర ముందు వెళ్తున్న మరో బైక్ నడుపుతున్న వ్యక్తి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న బైక్ ఢీకొని కిందపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండంగా జంగయ్య మృతి చెందాడు. షైబును గాంధీ ఆసుపత్రి తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షంలో విద్యుత్ సిబ్బంది సాహసం

నవాబ్‌పేట, సెప్టెంబరు 8 : మండలంలోని పోమాల సబ్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది తమ ప్రాణాలు లెక్క చేయకుండా విద్యుత్ సమస్య తీర్చారు. వివరాల్లోకి వెళితే.. పోమాల సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో లైన్‌మెన్ శ్రీకాంత్, హెల్పర్ రాజేందర్ రంగంబావితండా సమీపంలోని చెరువులో విద్యుత్ స్థంబం ఎక్కి, సెలఫోన్‌ల వెలుతురు సహాయంతో మరమ్మతు చేశారు. దీంతో మండలంలోని పలుగ్రామాలకు అర్థరాత్రి విద్యుత్ సరఫరా ప్రారంభించారు.

బాలిక అదృశ్యం

ఉండవల్లి, సెప్టెంబరు 8: మండలానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు తండ్రి శనివారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ కాలనీకి చెందిన బాలిక శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బహిర్భూమికి అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాగా అదే కాలనీలో అద్దెకుంటున్న యువకునిపై అనుమానం ఉన్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొనగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చెరువులో దూకి కార్మికుడి ఆత్మహత్య



భాస్కర్ (ఫైల్)

కొత్తకోట, సెప్టెంబరు 8: మండలంలోని రామకృష్ణాపూర్ చెందిన చెత్తబండి కార్మికుడు భాస్కర్ (35) శనివారం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య జయమ్మతో కుటుంబ సమస్యలపై గొడవ పడి మనస్థాపం చెంది చెరువులోకి దూకాడు. గమనించిన సమీప ప్రజలు కాపాడడానికి ప్రయత్నించినా నీటిలో మునిగి పోయాడు. కొంత సేపటికి యువకులు చెరువులోకి దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

అప్పుల బాధతో దాబా యజమాని ఆత్మహత్య



బిజేష్ కుమార్ మృతదేహం

కొత్తకోట, సెప్టెంబరు 8 : అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బిజేష్ కుమార్ (21) ఎనిమిది నెలల కిందట కొత్తకోటకు వచ్చి అమడబాకుల శివారు జాతీయ రహదారిలో దాబా అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ఆదివారం మధ్యరాత్రి డ్యూటీకి నిద్ర లేపమని వర్కరుకు చెప్పి స్టోర్ రూంలోకి వెళ్లాడు. వర్కర్ మధ్యరాత్రి బిజేష్ కుమార్‌ను నిద్ర లేపడానికి రూం తలుపులు కొట్టగా గడియ తీయలేదు. అనుమానం వచ్చి తలుపు సందులోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాబడుతున్న యజమానిని సూచి వెంటనే మరో వర్కర్ సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అడ్డాకుల మండల కేంద్రంలో ఉన్న అన్న దేవిలాల్‌కు సమాచారం ఇచ్చారు. దాబా సరిగా నడవకపోవడంతో అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నట్లు అన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్మికుడికి గాయాలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 8 : బైకు అదుపు తప్పి కింద పడడంతో పంచాయతీ కార్మికునికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కల్వకోల్‌లో శనివారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న రవి కోడేరు మండలం గంట్రావుపల్లికి అత్తారింటికి వెళ్లాడు. శనివారం తిరిగి పెద్దకొత్తపల్లికి వస్తుండగా కల్వకోల్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. రవిని చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అయిజ, సెప్టెంబరు 8: పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బీటీఆర్ టింబర్ డిపోపై ఆకస్మిక దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరికొందరు పరారీలో ఉన్నట్లు వివరించారు. 9 బైకులు, 3 సెల్‌ఫోన్లు, రూ.7,400 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో స్టూడియో దగ్ధం



దగ్ధమైన సామగ్రి

గోపాల్‌పేట, సెప్టెంబరు 9: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం కేంద్రంలో విద్యుదాఘాతంతో ఫొటోస్టూడియో పూర్తిగా దగ్ధమైంది. పొలికేపాడ్ చెందిన గుణగంటి వరప్రసాద్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఫొటోస్టూడియో, పక్కనే టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి పనులు ముగించుకుని వెళ్లాడు. మధ్య రాత్రి విద్యుదాఘాతంతో షాపు లోని సామాన్లు నిప్పంటుకున్నాయి. ఆదివారం ఉదయం వచ్చి షటర్ తెరిచి చూడగా స్టూడియో కు సంబంధించిన కంప్యూటర్, ప్రింటర్, టీస్టాల్‌కు చెందిన సామన్లు దగ్ధమయ్యాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరాడు.

బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ

మక్తల్, సెప్టెంబరు 8 : మక్తల్ పట్టణంలోని 12వ వార్డు ఆజాద్‌నగర్ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కూలిపోయిన ఇళ్లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజుల ఆశిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు బియ్యం, కందిపప్పు, మంచి నూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్ఫాన్ అన్వర్ హుసేన్, నాయకులు జయానంద్, వన్నెకారి సంతోష్, మన్నాన్, ఎండీ సాజిద్, రాజు, జయరాజ్, హుసేన్ పాల్గొన్నారు.

'ఆత్మహత్యకు పాల్పడొద్దు'

మద్దూర్, సెప్టెంబరు 8 : ఆత్మహత్యలకు పాల్పడొద్దని సుభిక్ష ఫౌండేషన్ కోఆర్డీనేటర్ శ్యామ్, సీపీఐ జిల్లా నాయకులు అంజిలయ్య గౌడ్, వెంకటేశ్ రైతులను కోరారు. ఆర్థిక ఇబ్బందులతో మండలంలో ఆత్మహత్య చేసుకున్న కుటటుంబాలపై ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నందిపాడ్ గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. గతంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలనే మండలంలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, ఎంపీటీసీ మా సభ్యుడు హన్మంతు, బాలయ్య, బస్వరాజ్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

మక్తల్, సెప్టెంబరు 8 : ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల నియామకం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందని వెంటనే మార్గదర్శకాలు విడుదల చేసి నియామకాలు చేపట్టాలన్నారు. తపస్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాకేష్, నాయకులు భీంరెడ్డి, నర్సిములు, రామాంజనేయులు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమదోపిడీ'

మక్తల్, సెప్టెంబరు 8 : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, కనీస వేతనాలు అమలుకావడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఘనత సీఐటీయూదే అన్నారు. సెప్టెంబరు 13వ తేదీ వరకు కార్మికుల సమ్యలపై అధ్యాయనం చేసి, 20 నుంచి 25వ తేదీ వరకు మండల కేంద్రాల్లో సదస్సులు, రిలే దీక్షలు చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 28న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, గోవిందరాజు, జోషి, కాశీనాథ్ పాల్గొన్నారు.

నేడు జిల్లా సైక్లింగ్ పోటీలు

మక్తల్, సెప్టెంబరు 8 : జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు సోమవారం సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖేలో ఇండియా సౌత్‌జోన్ రోడ్‌స్పీడ్ సైక్లింగ్ పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు నిజామాబాద్‌లో జరిగే సైక్లింగ్ పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో మక్తల్ మినీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు పాల్గొన్నారు. జిల్లా సైక్లింగ్ కోశాధికారి రూప, పీఈటీలు రమేష్‌కుమార్, అంబ్రేష్, శివశంకర్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, సెప్టెంబరు 8 : హోంగార్డులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎస్పీ మాట్లాడారు. మహబూబ్‌నగర్ బదిలీ గురించి అడుగగా, ఇది ఉమ్మడి జిల్లా సమస్య అని త్వరలో పరిష్కరించనున్నట్లు ఎస్పీ హామీ ఇచ్చారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించే హోంగార్డులు స్థానికంగా ఉండే వారికి క్వాటర్స్ కావాలంటే ఇస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌లలో అన్ని రకాల విధులు నిర్వహించేది ఒక్క హోంగార్డు అన్నారు. విధులు నిర్వహించే సమయంలో క్రమ శిక్షణ, సమయపాలన పక్కగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రామ్‌లాల్, ఆర్ఐ నరసింహ, హోంగార్డులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

ఊట్కూర్, సెప్టెంబరు 8 : మండల కేంద్రంలోని గోశాల హనుమాన్ మందిరం నిర్మాణానికి బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి రూ.50 వేల విరాళం అందించారు. శనివారం రాత్రి గ్రామంలోని మొయిన్ బజార్ హనుమాన్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మక్తల్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి బీకేఆర్ ఫౌండేషన్ తరఫున ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శోభాయాత్రకు బందోబస్తు పరిశీలన

ఊట్కూర్, సెప్టెంబరు 8 : ఊట్కూర్‌లో నిర్వహించే వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిచే శోభాయాత్ర బందోబస్తు ఏర్పాట్లను శనివారం డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. గ్రామంలో శోభాయాత్ర కొనసాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు వినాయక నిమజ్జనం జరిగే పెద్ద చెరువు ప్రాంగణాన్ని పరిశీలించారు. క్రేన్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని చూసి ఎక్కడ పికెట్‌ను ఏర్పాటు చేయాలో ఎస్ఐ కృష్ణంరాజుతో చర్చించారు. అలాగే ట్రాఫిక్ డైవర్షన్ గురించి చర్చించి, ఎక్కడ బారికెట్లు ఏర్పాటు చేయాలో సూచించారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రేపు జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 8 : నారాయణపేట క్రీడా మైదానంలో ఈనెల 10న ఉదయం ఏడు గంటలకు జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక జరుగుతాయని అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సౌత్‌జోన్ పోటీలు ఉంటాయన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కోస్గి సెప్టెంబరు 8 : మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తామని నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్‌జీయూ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 10, 11, 12వ తేదీల్లో ఖోఖో, కబడ్డీ ఆటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు జూనియర్ సీనియర్ విభాగం వారు 14 నుంచి 17 సంవత్సరాల లోపు వారు పాల్గొనాలని సూచించారు.

'బాలికలు విధిగా కరాటే నేర్చుకోవాలి'

నారాయణపేట, సెప్టెంబరు 8 : బాలికలు విధిగా కరాటే నేర్చుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మాస్టర్ కేశవ్ అకాడమీ విద్యార్థులకు ఆదివారం కృష్ణగోకులం పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కరాటే బెల్టులు ప్రదానం చేశారు. సీనియర్ మాస్టర్ అశోక్ పర్యవేక్షణలో బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించగా, లిఖిత, కార్తీక్, స్రవంతి, రాజేశ్వరి బ్రౌన్ బెల్టులు అందుకున్నారు. భానుతేజ, ప్రశస్త మెరున్ బెల్టు అందుకోగా, అఖిల్, రిత్విక్ అద్వైత్, శివశంకర్, అశ్విని, అలోక్, కీర్తన బ్లూ బెల్ట్ అందుకున్నారు. సాత్విక, అమూల్య, జశ్వత, అభిలాష్, భావేశ్ నాయుడు ఆరెంజ్ బెల్టు అందుకోగా, నాయుడు, ముకుంద, వరుణ్, రంజిత్, మహేశ్వరీ, జతిన్, నవ్య ఎల్లో బెల్ట్ అందుకున్నారు. కార్యక్రమంలో అకాడమి ఫౌండర్ కేశవ్‌గౌడ్, మాస్టర్ అశోక్, శివకుమార్ యాదవ్, రసూల్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపల్లి సెప్టెంబరు 8 : మండలంలోని నిడ్జింత గ్రామ పరిధిలోని వెలసిన తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం స్వామి వారికి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వేంకటేశ్వర స్వామి ఘట్టు వరకు జల్దిబిందె మరియు పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అదే విధంగా ఆదివారం కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో కనీస వసతులు కల్పించుటకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, కోట్ల మహేందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



పేట ఎస్పీ కార్యాలయంలో పూజలో పాల్గొన్న ఎస్పీ దంపతులు



చంద్రవంచ గ్రామంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న యువకులు



కలెక్టరేట్‌లో మట్టి గణపతికి పూజలు చేసున్న ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల

కొలువుదీరిన ఏకదంతుడు

▸▸ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, ఎస్పీ యోగేష్ గౌతమ్



బిజ్వార్ గ్రామంలో పూజలో పాల్గొన్న భక్తులు



మక్తల్‌లో నిర్వహించిన వినాయక శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట/రూరల్/టౌన్/మక్తల్/ధన్వాడ/కోస్గి/మద్దూర్/మరికల్/నర్వ/మాగనూరు/కృష్ణ/దామరగిద్ద/ఊట్కూర్, సెప్టెంబరు 8 : జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం మండపాల్లో గణనాథులు కొలువు దీరారు. స్థానిక సీవీఆర్ బంగ్లాలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించగా, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, కన్న జగదీష్, ప్రతాప్‌రెడ్డి, బుల్లెట్ రాజు పూజల్లో పాల్గొన్నారు. పళ్ల దీక్షిత్ నివాసంలో 13వ దశాబ్దపు నిమజ్జనం ఎరుగని నిత్య పూజలు అందుకుంటున్న వినాయకుడికి బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు రఘువీర్ యాదవ్, ప్రవీణ్, మెలగిరి కాంబ్లే, హన్మంతు, సత్యనారాయణ, కౌన్సిలర్ మేఘన శ్రీపాద్ పూజలు నిర్వహంచారు. బీజేపీ కార్యాలయంలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నాయకులు రఘురామయ్య గౌడ్, మిర్చి వెంకటయ్య పూజలు చేయగా, పళ్ల లక్ష్మీ పూజ గణపతి దగ్గర సీతారాం దీక్షిత్, వెంకటేష్, దిలీప్ దీక్షిత్, ధరణీదర్, విద్యాదర్, ధీరజ్, నీరజ్, నితిన్ అన్నదానం చేశారు. శక్తిపీఠంలో మహా గణపతి బ్రహ్మోత్సవాలు స్వామి శాంతనంద ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోలీస్ హెడ్‌క్వాటర్స్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ లింగయ్య ఆర్ఐ నరసింహ, ఏస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐ శివశంకర్ పాల్గొన్నారు. పేట ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఏ సలహాదారులు, పోలేపల్లి రాజు, భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించగా, ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల ప్రత్యేక పూజలు చేశారు. మరికల్ మండల కేంద్రంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మాగనూరు, కృష్ణ, దామరగిద్ద మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఊట్కూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో యువకులు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజలు నిర్వహించారు.

- మక్తల్ పట్టణంలోని వివిధ వార్డుల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు పడమటి ఆంజనేయస్వామి ఆలయంన నుంచి వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్‌లోని విశ్వకర్మ ఇంటి వద్దకు వినాయక ప్రతిమలతో ఊరేగింపుగా వెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం వివిధ వార్డులకు ప్రతిమలను తరలించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు శోభాయాత్రలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భీంరెడ్డి, టీడీపీ నాయకులు మదుసూధన్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రామాంజనేయులుగౌడ్, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.
- ధన్వాడ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం, కంచుకోట, ఎస్సీ వాడతో పాటు పలు వినాయకుల మండపాల వద్ద ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినాయక మండపాల నిర్వాహకులు, గీత కార్మిక సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. అదే విధంగా బీసీ కాలనీలో ప్రత్యేకంగా రుద్రాక్షలతో వినాయకుడిని ప్రతిష్ఠించారు.
- కోస్గి పట్టణంలోని మున్నూర్ వీధిలో, శివాజీ కూడలిలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.
- మద్దూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గణనాథులు కొలువుదీరాయి. మద్దూర్‌లోని పాత బస్టాండ్, కాపుగేరి, అమర్‌గడ్డ, మీదిగేరి, మెట్లగేరి, పాతబస్టాండ్, భూనీడ్ ఎస్సీ కాలనీ, కొత్త బస్టాండ్ వీదుల్లో గణాథులను ప్రతిష్ఠించి, పూజలు చేశారు.
- నర్వ మండల కేంద్రంలోని రామ్ మందిర్ వద్ద ఆర్యన్ గ్రూప్ యువత, బస్టాండ్ వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వమించారు. గజ్జెలమ్మ గుడి, గోపాల కృష్ణ ఆలయం, వేంకటేశ్వర ఆలయం, తిలక్‌నగర్ వినాయకులను ప్రతిష్ఠించారు.

ఎక్లాస్‌పూర్‌లో ఒకే వినాయకుడు

48 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ



ఎక్లాస్‌పూర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడు

నారాయణపేట రూరల్ : ప్రతీ గ్రామంలో వాడవాడలా వినాయక మండపాలు ఏర్పాటు చేసి వివిధ సంఘాలు, యువకుల ఆధ్వర్యంలో వినాయకులను ప్రతిష్ఠించడం సర్వ సాధారణం. అయితే ఇక్కడ మాత్రం గ్రామానికి మొత్తం ఏకదంతుడు ఒక్కడే. గ్రామస్థులు అంతా కలిసి ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఇది నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్‌లో గత 48 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ. ఎక్లాస్పూర్ గ్రామ గోవింద రాజుల సేవా సమితి ఆధ్వర్యంలో గోవిందరాజుల ఆలయంలో వినాయక చవితి రోజు వినాయకుడిని ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి స్వామివారికి ఉదయం, సాయంత్ర వేళల్లో నిత్య పూజలు నిర్వహిస్తారు. అయితే గత పదేళ్ల క్రితం గ్రామంలో మరో వినాయకుడిని ప్రతిష్ఠించగా అపశృతి జరగ్గా అప్పటి నుంచి ఒకే వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.







నర్వ రామమందిర్, మరికల్, కృష్ణ మండల కేంద్రాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి పూజలు చేస్తున్న భక్తులు



ధన్వాడలో రుద్రాక్షలతో చేసిన వినాయకుడు





బోయిన్‌పల్లి ఆంజనేయ స్వామి ఆలయం, మద్దూర్‌లో భవాణి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడు

విజయోత్సవ సభ పోస్టర్ల విడుదల

ధన్వాడ, సెప్టెంబరు 8 : ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఈనెల 21న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే విజయోత్సవ సభ పోస్టర్లను శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ధన్వాడలో ఆ సంఘం నాయకులు గండి బాల్‌రాజు, ఎలుక బాల్‌రాజు విడుదల చేసి, ఎన్నో ఏళ్ల కళ నెరవేరిందన్నారు. ఎల్.రాజు, ఎర్ర ఆంజనేయులు, పూజారి నరసింహులు, ఈరనాగుల శంకర్, కిష్టయ్య పాల్గొన్నారు.

● మరికల్ : మండల పరిధిలోని పసుపుల గ్రామంలో ఆదివారం టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర విజయోత్సవ సభ కర పత్రాలు రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల సుదీర్ఘ సామాజిక ఉద్యమానికి అలుపెరుగని పోరాటానికి సామాజిక న్యాయం అమలు కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీకోర్టు ఇచ్చినవంటి తీర్పును స్వాగతిస్తూ ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను ఈనెల 21న మండల శివారులో ఉన్న సూర్యచంద్ర కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఇటుక రాజు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి జోగు రామస్వామి పాల్గొంటారన్నారు. విజయోత్సవ సభకు మండలంలోని ప్రతీ గ్రామం నుంచి దళితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎలుక బాల్‌రాజ్, సీమ బాలకృష్ణ, సీమ కురుమయ్య, మాసన్న, మాజీ సర్పంచ్ రాజు, పంతులు భీమన్న, సురేష్, వెంకటేష్, కుంటి నర్సిములు, చంటి హనుమంతు, సతీష్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



పెద్దపొర్ల గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్, సెప్టెంబరు 8 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కోటకొండ, అభంగాపూర్ శివారులో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జి.వెంకట్రాములు, హాజీమలంగ్, ఇప్ట జిల్లా సహ కార్యదర్శి నర్సిములు, ప్రభాకర్ మాట్లాడుతూ అభంగాపూర్ రామతీర్థం చెరువు వెనకాల అలుగు తెగి నీరు పొలాల్లోకి రావడంతో వరి పంటలు కోతకు గురై ఇసుక, మట్టి పేరుకుపోయిందన్నారు. ఒక్కో రైతుకు దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లిందన్నారు. కానీ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ సంఘం నాయకులు రాములు, సుభాష్, రఫీక్, పీవైఎల్ సలీం, దస్తప్ప, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

● మద్దూర్ : వర్షాలకు పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని ఆదివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు దెబ్బతిన్న జొన్న, పత్తి, కంది, పంటలను పరిశీలించి, పూర్తిగా నీటిలో మునిగిపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఆ సంఘం నాయకులు కొండ నర్సింహులు, అంబటి నర్సింహులు, వెంకటప్ప, మల్లేశ్, వెంకటప్ప, కృష్ణయ్య ఉన్నారు.

● ఊట్కూర్ : ఇటీవల కురిసన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు కిరణ్, ఈశ్వర్, బాబు, కనకరాయుడు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలో వేసిన పత్తి, వరి, కంది పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం అంచనా వేశారు. గ్రామంలో సూమారు 40 ఎకరాల పత్తి పంటతో పాటు వరి, కంది పంటలు సైతం పూర్తిగా నష్టం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేలు, పత్తి పంటకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు సంజీవ, నర్సిములు, కుర్వ లింగప్ప, కృష్ణయ్య, కావలి బాలప్ప, తిప్పయ్య, సురేష్, అజయ్, సోహెబ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధన్వాడ, సెప్టెంబరు 8 : ధన్వాడ మోడల్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో అంజలీదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 9 నుంచి 11 వరకు దరఖస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పదోతరగతి పాసై ఉండాలన్నారు.

'సీపీఎస్‌ను రద్దు చేయాలి'

మక్తల్ రూరల్, సెప్టెంబరు 8 : భాగస్వామ్య పింఛన్ పథకాన్ని రద్దు చేసి, పాత పింఛన్ పథకాన్ని పునరుద్దరణ చేసేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని దైవాన్ని వేడుకున్నట్లు నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్ఓపీఆర్‌యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి రఘునందన్ తెలిపారు. సెప్టెంబరు 16న ఢిల్లీలో నిర్వహించే సదస్సు విజ యవంతం కోసం ఆదివారం పంచదేవ్‌పహడ్, కుర్వపురంలో పూజలు చేశారు.

బదిలీపై వెళ్లిన ఏఈవోకు సన్మానం

మాగనూరు, సెప్టెంబరు 8 : మాగనూరు ఏఈవోగా పనిచేసి, దేవరకద్రకు బదిలీపై వెళ్లిన హరీష్‌కుమార్ శెట్టిని ఆదివారం రైతు వేదిక వద్ద రైతులు ఘనంగా సత్కరించారు. మండల రైతు సమన్వ య కమిటీ మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రైతులు పురుషోత్తం రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, ముష్టి రాము, ఆగ్రో యజమాని మహేష్, బాలరాజు, ఆదినారాయణ, అశోక్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి నియామకంపై హర్షం

మరికల్, సెప్టెంబరు 8 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఎంపికపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకుడు సూర్యమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

సీఎం ప్రజావాణి 11కు వాయిదా

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 8 : హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు బాపూలే ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 11కు వాయిదా వేసినట్లు ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్జీలను స్వీకరించేందుకు నిర్వహించే ప్రజావాణి తేదీని కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం ఉన్నందున్న వాయదా వేసినట్లు తెలిపారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

నారాయణపేట, సెప్టెంబరు 8 : జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఊట్కూర్ మండలంలో 25.0 మిల్లీ మీటర్ల వర్షం కురియగా, అత్యల్పంగా మరికల్ మండలంలో 3.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మద్దూర్‌లో 22.2 మి.మీ., మాగనూరులో 20.0 మి.మీ., మక్తల్‌లో 19.0 మి.మీ., కృష్ణలో 18.0 మి.మీ., కోస్గిలో 17.6 మి.మీ., దామరగిద్దలో 17.0 మి.మీ., నారాయణపేటలో 11.8 మి.మీ., నర్వలో 7.8 మి.మీ., ధన్వాడలో 6.2 మి.మీ., వర్షపాతం నమోదైంది.